క్లుప్తంగా

వచ్చే నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు

రాజానగరం: ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి పోలింగ్ బూత్‌ల వద్ద డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తామని తహసీల్దార్ పవన్‌కుమార్ తెలిపారు. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. దీనికిగాను ఫారమ్ 6లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే మరణించిన, శాశ్వతంగా వేరో ప్రాంతానికి వలస వెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాల్సి ఉందని, అందుకుగాను ఆయా కుటుంబ సభ్యుల నుంచి ఫారమ్- 7, చిరునామా, పోలింగ్ కేంద్రాల బదిలీలకు ఫారమ్-8లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడాలన్నారు. తుది ఓటరు జాబితాను జనవరి 5న ప్రచురిస్తారన్నారు. ఏవిధమైన తప్పులు లేకుండా ఓటరు నమోదు ప్రక్రియ హేతుబద్ధంగా జరగడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



ట్రైసైకిల్ అందజేస్తున్న సబ్బెళ్ల అమ్మిరెడ్డి

పెదపూడి: దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీఎంఎస్ డైరెక్టర్, పైన గ్రామ పీఏసీఎస్ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి తెలిపారు. పైన గ్రామ పీఏసీఎస్ సహకారంతో స్థానిక ఒక దివ్యాంగుడికి శనివారం ట్రైసైకిల్ అందజేశారు. అమ్మిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు పేపకాయల సూర్యనారాయణ(డీటీఎస్), కొల్లు వీర్రాజు, ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్‌బాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పంపన నాగరాజు, దంగేటి దుర్గారావు, దాట్ల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా ఉచిత బియ్యం

రాజానగరం: దేశంలో పేదరికంలో ఉన్న ఒక్కో కుటుంబానికి ప్రధానమంత్రి ప్రతి నెలా 5 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి అవినాష్ శనివారం తెలిపారు. ఈ కారణంగా రాష్ట్రంలో ఉన్న రేషన్ వాహనాలపై ప్రధాని ఫొటో కూడా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మోది సత్తిబాబు, బిక్కిన కామరాజు చౌదరి, అబ్బారెడ్డి, పి.సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతం పరిశీలన

సీతానగరం: నల్గొండలోని సర్వే నంబరు 241/3లో ఉన్న కొండ ప్రాంతాన్ని మండల సర్వేయర్ ప్రమీల శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నల్గొండ కొండను కొంతమంది అక్రమంగా తవ్వుతున్నారని చినకొండేపూడికి చెందిన న్యాయవాది చిడిపి నకుల సురేష్ జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి మైన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు చేరుకుని రికార్డులను పరిశీలించారు. శనివారం నల్గొండ సచివాలయం సర్వేయర్ ప్రమీల తన సిబ్బందితో కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. తవ్వకాలు జరిపిన ప్రాంతం ఏ పట్టాల పరిధిలోకి వస్తుందో నిర్ధారించిన అనంతరం నివేదికను పైఅధికారులకు అందించనున్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీ అయిన పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ ఉషారాణి, ఉపాధ్యాయులు పి.అరుణకుమారి, రాచకొండ నాగగంగాభవానీలను నూతన హెచ్‌ఎం కె.లక్ష్మీకాంతం, ఎస్‌ఎంసీ చైర్మన్ పి.చిన్ని ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కోట సత్యవతి, వార్డు సభ్యుడు రామభద్రం, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ క్రికెట్ క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్

బిక్కవోలు: భారత్ క్రికెట్ క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ అని కొంకుదురు విద్యార్థులు శనివారం తెలిపారు. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ క్రికెట్ స్టేడియంలో భారత, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరగనున్న వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత క్రికెట్ టీం విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లకార్డు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీ కృష్ణసాయి, పడాల ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మణరెడ్డి, అప్పారావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశలు వరించెను..

- వరి కోతల పనుల్లో నిమగ్నం
- యంత్రాలను ఆశ్రయిస్తున్న రైతులు
- ఖర్చు, సమయం ఆదాతో ఆనందం



చంద్రేడులో యంత్రం ద్వారా వరి కోతలు చేస్తున్న రైతులు

రంగంపేట: మెట్టలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు యంత్రాల సాయంతో పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వరి దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. గత 15 రోజుల నుంచే కోతలు ప్రారంభమయ్యాయి.

తక్కువ సమయంలో ధాన్యం ఇంటికి..

బోర్లు, చెరువులు, కాలువల కింద సాగు చేసిన వరిని రైతులు ఒబ్బిడి చేసుకుంటున్నారు. కూలీల కొరత, కూలి ధరలు ఎక్కువగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు వరి కోత యంత్రాలతో పంటను కోస్తున్నారు. ఒక ఎకరాకి 8 నుంచి 10 మంది వరకూ కూలీలు అవసరం ఉండగా మగవారికి రూ.600, మహిళలకు రూ.500 కూలి చెల్లించాల్సి వస్తోంది. కోత కోయడం, పన తిరగ వేయడం, పన కట్టడం, కుప్ప వేయడం, కుప్ప నూర్పడం వంటి కార్యక్రమాలు చేయాల్సి ఉండగా, కూలీలు, ట్రాక్టరకు రూ.10 నుంచి రూ.20 వేల వరకూ ఖర్చవుతుందని, పైగా ఈ పనులకు వాతావరణం కూడా అనుకూలించేలా ఉండాలి అప్పుడే పంట ఇంటికి వస్తుంది. లేదంటే కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల దువల్ల చాలా మంది రైతులు యంత్రాలను ఉపయోగించి కోతలు కోయిస్తున్నారు. అనంతరం నేరుగా ధాన్యాన్ని సేకరించి, కళ్లల్లోనే ఆరబెట్టి బస్తాల్లో నింపుతున్నారు. దీనికి ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ఖర్చు అవుతుంది. అంతేకాకుండా గంటన్నర వ్యవధిలో ధాన్యం చేతికి అందుతోంది.

ఆశించిన స్థాయిలో దిగుబడి

ఈ ఏడాది మండలంలో సుమారు 7,131 ఎకరాల్లో వరి సాగు చేశారు. బోర్లు, కాలువలు, చెరువు కింద సాగు చేసిన వరికి తగు జాగ్రత్తలు తీసుకోవడంతో తెగుళ్లు తక్కువగా ఉండి దిగుబడి ఆశించిన స్థాయిలో అందింది. బీపీటీ రకం ఎకరాకు 28 నుంచి 35 బస్తాలు, 1156 రకం 35 నుంచి 40 బస్తాలు, స్వర్ణ 28 నుంచి 35 బస్తాలు, ఆర్‌పీ బయో 226 రకం 30 నుంచి 40 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి సాధారణ రకానికి 75 కేజీల బస్తాకు రూ.2183 అదేవిధంగా ఏ గ్రేడు రకానికి 75 కేజీల బస్తాకు రూ.2203 మద్దతు ధర చెల్లిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బస్తాకు రూ.143 పెరిగింది.



యంత్రంతో కోసిన ధాన్యం తేమ లేకుండా ఆరబోత

బొండాలు రకం వరి సాగు చేయవద్దు



రబీలో బొండాలు రకం వరి సాగు చేయవద్దు. బొండాలను ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదు. ఎవరైనా సొంతంగా బొండాలు పండించినా వాటిని కొనుగోలు కేంద్రాలు తీసుకోవడంలేదు. కేరళ మార్కెట్ లేక బొండాలు కొనుగోలు చేయడంలేదు. బొండాలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1121 శ్రీదత్రి రకం సాగు చేయాలి. ఈ రకం దిగుబడి కూడా బాగుంటుంది. ఎకరాకి 40 నుంచి 44 బస్తాలు వస్తాయి.

– డి.వి.కృష్ణ, ఏడీఏ, అనపర్తి

వైభవంగా వీరుళ్లమ్మ శోభాయాత్ర



ఆలయంపై ఏర్పాటు చేసే కలశలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: గ్రామ దేవత వీరుళ్లమ్మ నూతన ఆలయ ప్రవేశం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన పూజా కార్యక్రమాలు రెండో రోజు శనివారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ చెల్లపిళ్ల త్రిమూర్తిశర్మ ఆధ్వర్యంలో రుత్వికులు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని ఆలయంపై ఏర్పాటు చేసి కలశలకు పంచామృతాభిషేక పూజలు జరిపారు. అనంతరం శనివారం మధ్యాహ్నం అమ్మవారి ప్రతిష్ఠామూర్తితో నిర్వహించిన శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: సంపర గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక, తులసి పూజ, అమ్మవారికి కుంకుమ, పంచామృతాభిషేకాలు చేశారు. అర్చకుడు హనుమంతాచార్యులు భక్తులతో వ్రతాన్ని ఆచరింపజేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు గోవిందనామాల పారాయణం చేశారు.

మంచి ఆహార అలవాట్లతో ఆరోగ్యం



గాదాలలో ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మధురపూడి: మంచి ఆహార అలవాట్లతో ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగెల రాజా అన్నారు. శనివారం గాడాల హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారంలో పంచదార, ఉప్పు, నూనెల వాడకం తగ్గించాలన్నారు. సమాజంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల జ్యోతికుమారి, రోటరీ క్లబ్ గవర్నర్, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కె.జాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తల్లిదండ్రుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా వీరన్నచౌదరి

మధురపూడి: రాజానగరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా నీరుకొండ వీరన్నచౌదరి నియమితులయ్యారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ముగ్గళ్లలో ఇళ్ల పట్టాల పంపిణీ



ముగ్గళ్ల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. శనివారం ముగ్గళ్లలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో 215 మందికి 5.27 ఎకరాల్లో కేటాయించిన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదల మెరుగైన జీవనానికి దోహదపడుతున్నాయన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, చేదోడుతో పాటు ఇళ్ల పట్టాల పంపిణీ పేదల జీవితాలను మార్చుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ దాదాపు రూ 2.50 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలో జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సంబంధించి 300 ఎకరాలు రైతుల నుంచి తీసుకున్నారని, వంద ఎకరాలకు సంబంధించి రైతులు తమకు అన్యాయం జరిగిందని గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. గత ఎన్నికలలో టీడీపీ 650 హామీలకు పైగా ఇచ్చిందని, అప్పట్లో అధికారం చేపట్టినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసిందన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ నగదును నేరుగా ఖాతాలకు వేసి హామీని నిలబెట్టుకుందన్నారు. నియోజకవర్గంలో రూ.216 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకానికి శ్రీకారం చుట్టామని, సీతానగరం మండలంలో నాలుగు లైన్ల రోడ్డు పనులు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ మోడరైజేషన్, రఘుదేవపురంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం, పురుషోత్తపట్నం నుంచి బొబ్బిల్లంక వరకూ ఏటిగట్టుకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. ఇనుగంటివారిపేటలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనాలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న జెడ్పీటీసీ సభ్యురాలు చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌బాబు, మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, తహసీల్దార్ కృష్ణారావు, ఎంపీడీఓ కె.రమేష్, సర్పంచ్ సత్యం రాంపండు, నాయకులు ఆళ్ల కోటేశ్వరరావు, బొమ్ములు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఇనుగంటివారిపేటలో గడప గడపకూ..



ఇనుగంటివారిపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. శనివారం ఇనుగంటివారిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి రాజా వివరించి, కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా అనేక పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన అక్క చెల్లెమ్మలు, అవ్వ, తాతలు ఉన్నారని, వారి మోములో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. ఇనుగంటివారిపేటలో అనేక అభివృద్ధి పనులు చేశామని, ప్రధానంగా నాడు- నేడు కార్యక్రమంలో రూ.36 లక్షలతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.49.60 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి, పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. ఈ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సీసీ డ్రైనేజీల నిర్మాణానికి రూ.45 లక్షలు ఖర్చు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మళ్లీ పట్టంకట్టాలని రాజా కోరారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, సర్పంచ్ సత్యం రాంపండు, గుల్లి దామోదరం తదితులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఫిజిక్స్ అధ్యాపకుడు శ్రీనివాసరావు

సీతానగరం: విద్యార్థులు సమాజ సేవ చేస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి పోతురాజు బాబ్జీ అన్నారు. శనివారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు గెస్ట్ లెక్చర్స్ కార్యక్రమం నిర్వహించారు. సమాజం– విద్యార్థుల పాత్ర అనే అంశంపై బాబ్జీ ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో బాలికలు– ఆరోగ్య పరిరక్షణ అనే అంశంపై అటానమస్ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు జి.శ్రీనివాసరావు ప్రసంగించారు. బాలికలు పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, బెల్లం, వేరుశెనగ వంటి ఇనుము లభించే పదార్థాలు తినడం ద్వారా రక్తహీనత బారినుంచి బయటపడవచ్చన్నారు. అనంతరం పోతురాజు బాబ్జీ, శ్రీనివాసరావులను సత్కరించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.సుధామయి, లెక్చరర్లు వాణి, అలేఖ్య, వరలక్ష్మి, వెంకటేష్, ఫణీంద్రకుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ సమావేశం జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

మధురపూడి: బూరుగుపూడి ద్వారకామయి కల్యాణ మండపంలో ఆదివారం జరిగే యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ పిలుపునిచ్చారు. శనివారం ద్వారకామయి కల్యాణ మండపంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వెయ్యి మంది ఉపాధ్యాయులు సభలో పాల్గొని ఉద్యమ సమీక్ష, తీర్మానాలు చేస్తారన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నుంచి బూరుగుపూడి కల్యాణ మండపం వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, టీచర్ ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు హాజరవుతారన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, జిల్లా కోశాధికారి ఈవీవీఎస్ ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.శ్రీనివాస్, కోరుకొండ మండలాధ్యక్షుడు జీవీ శివబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సీతానగరం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సీతానగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ తేలి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల పాత్ర నిర్వహణ ఉపయోగాలపై విద్యార్థులకు పోటీ పరీక్షలు జరిపారు. సీతానగరం ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూళ్లు, చినకొండేపూడి సూర్యచంద్ర హైస్కూల్, రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్, జ్ఞాననిధి స్కూళ్లలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఆయా స్కూళ్ల ఉపాధ్యాయులు ఎస్.విజయ్‌కుమార్, జి.శేఖర్‌బాబు, ఎస్.విజయ్‌కుమార్, కన్నూరి సతీష్‌బాబు, రామకృష్ణ, మల్లిక పర్యవేక్షించారు. అనంతరం గ్రంథాలయంలో చదవటం మాకిష్టంలో భాగంగా పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు స్నాక్స్ అందించారు.

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. శనివారం 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొవ్వూరి సత్తి రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయ శాఖ అధికారి నందికొళ్ల బాల తెలిపారు. విజేతలకు సోమవారం బహుమతులు అందిస్తామన్నారు.

రాజానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు జరిగాయి. 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ప్రతిభను కనబరిచి, విజేతలుగా నిలిచారు.

గైట్‌లో ప్రపంచ పురుషుల దినోత్సవం

రాజానగరం: స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ పురుషుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ధనరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. విద్యార్థులు, అధ్యాపకులకు క్రికెట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం అసోసియేట్ ప్రొఫెసర్ డి.కవిత పర్యవేక్షణలో జరిగింది.

సౌత్ జోన్ ఖోఖో పోటీలకు 'నన్నయ' జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అతిథులు

అనపర్తి: ఆదికవి నన్నయ యూనివర్సిటీ మెన్ ఖోఖో జట్టును శనివారం ఎంపిక చేశారు. స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన వర్సిటీ మెన్స్ ఖోఖో అంతర్ కళాశాలల పోటీల్లో ఈ జట్టు ఎంపికైంది. ఈ పోటీల్లో వర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి మొత్తం 6 జట్లు, 20 మంది ప్రొబబుల్స్ పాల్గొన్నారు. లీగ్ దశకు చేరిన ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ (గోపన్నపాలెం), ఐడియల్ కళాశాల (కాకినాడ), ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం), పీఆర్ కళాశాల (కాకినాడ) జట్ల మధ్య శనివారం పోటీలు జరిగాయి. ఇందులో ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల (రాజమహేంద్రవరం) ప్రథమ, ఐడియల్ కళాశాల ద్వితీయ, ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ తృతీయ స్థానాలు సాధించాయని పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ, జీబీఆర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎంవీవీ రామారెడ్డి తెలిపారు. వర్సిటీ ఖోఖో మెన్ జట్టుకు 15 మందితో పాటు స్టాండ్‌బైగా మరో ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీడీ వి.జయరాజ్ పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 26 నుంచి 30వ తేదీ వరకూ కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొంటారని తెలిపారు.

వర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సీహెచ్ దుర్గా ప్రసాద్ (డీఆర్‌కే కళాశాల-జి.మామిడాడ), కె.పవన్ కుమార్ (ఎస్ఆర్‌డీసీ-పిఠాపురం), టి.బాలనాగేశ్వరరావు, కె.చరణ్ (ఐడియల్ కళాశాల-కాకినాడ), జి.ప్రవీణ్ కుమార్ (ఎంఎస్ఎన్ కళాశాల-కాకినాడ), కె.వరప్రసాద్ (ఎస్‌వీఎస్‌డీసీ కళాశాల-కిర్లంపూడి), సీహెచ్ రోహిత్, ఎస్.చంద్రమౌళి (జీడీసీ కళాశాల-తుని), ఎస్.సందీప్, ఎం.వెంకటేష్, ఎం.రాము (ఆర్ట్స్ కళాశాల-రాజమహేంద్రవరం), కె.సతీష్ (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ-గోపన్నపాలెం), ఎస్.సతీష్ (బీఎస్ఆర్‌డీసీ కళాశాల-దివిలి), బి.అశోక్ (సీఆర్ రెడ్డి కళాశాల-ఏలూరు), వి.నవీన్ కుమార్ (ఎస్ఆర్‌జీసీ కళాశాల-కాకినాడ) వర్సిటీ మెన్ జట్టుకు ఎంపికయ్యారు. వీరితో పాటు బీవీవీ రమణ, కె.మణికంఠ, టి.రవికుమార్, జి.మహేష్‌లను స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. వీరిని ఈవెంట్ చైర్మన్, జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ అబ్బాయిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి, విద్యా సంస్థల పాలక మండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, సెలక్షన్స్ అబ్జర్వర్ డాక్టర్ నరసింహరాజు, కమిటీ సభ్యులు పాపారావు, దుర్గాప్రసాద్ అభినందించారు.